# పందెం

గుత్తుల భాస్కరరావు



విశాలమైన హాల్లో ఎదురు బదురు సోఫాల్లో పడుకున్నట్టు కూర్చొని రామనాథం' సోమనాథం లోకాభిరామాయణంలో మునిగిపోయారు.

హాల్లో ఓ మూల కుర్చీలో కూర్చుని రామనాథం భార్య శాంత స్వెట్టరు అల్లుకుంటూంది.

స్నేహితులిద్దరూ కబుర్లాడుకుంటుండగా... శాంత పక్కన... ఫోను మోగింది. ఆమె చాలా శ్రద్ధగా అల్లుతుండడంవల్ల ఫోన్ వెంటనే ఆన్సర్ చెయ్యలేకపోయింది. మూడు దఫాలు మోగనిచ్చి రామనాథం ఒక్కసారి భార్యమీద గయ్యిమన్నాడు.

"బుద్ధి లేదూ? ఫోన్ ఎత్తాలని జ్ఞానం లేదూ?" అని కసురుకున్నాడు.

శాంత బిక్కచచ్చిపోయి... ఊలు సామగ్రి అక్కడ పడేసి ఫోన్ దగ్గర కెళ్ళింది.

రామనాథం మీసాలు దువ్వుకుంటూ "సోమూ! చూసావా. భార్య అంటే అలా వణికి చావాలి. నేనన్నా నా కేకలన్నా దానికి సింహస్వప్నం. నేను ఎంత చెబితే అంత! నిల్చోమంటే నిల్చుంటుంది. కూర్చోమన్నా అంతే," అన్నాడు.

సోమనాథం "పెద్ద చిత్రమేముంది. నా భార్యా డిటోయే" అన్నాడు.

"ఊరుకోవాయ్. కొయ్యకు. చెప్పుకోడానికి సిగ్గులేదు. నీ భార్య సంగతి ఎవడికి తెలీదు."

"ఎవడయ్యా నీకు చెప్పింది. పద్మ

కూడా నా మాట జవదాటదు. నేను కా అంటే కా. కి అంటే కి."

"మా మేనమామ వున్నాడు. యింకా కోసేద్దును - అన్నాడట... నీలాంటి వాడు."

యింతలో శాంత దగ్గరకు వచ్చింది.

"ఏవండీ. మహిళామండలి సెక్రటరీ ఫోన్ చేసింది. ఈ ఆదివారం భీమ్లీ ట్రిప్ వేస్తున్నార్ట... యాభై రూపాయలు..." అంటూ నసిగింది.

స్నేహితుడున్నాడని... మరీ... రామనాథం విజృంభించాడు. "ఊ! యాభై రూపాయలు! నాదగ్గర నీ తాత సొమ్ము దాచలేదు. భీమ్లీలేదు గీమ్లీలేదు. ఓ మూల్న తగలడు" అని అరిచాడు. శాంత మారు మాట్లాడకుండా భీతిగా తనచోటికి వెళ్ళిపోయింది.

"చూశావ్ సోమూ! డబ్బుకూడా నా గుప్పెట్లోనే. దానికి పైసా కావాలంటే నన్ను దేవిరించాలి. నువ్వూ ఉన్నావ్. ఎందుకు? ఇనప్పెట్టె మీ ఆవిడచేతిలో ఉంటుంది. ఆవిడ దయదలచి నెలకి పదో పరకో పడేస్తుంది. ఏనాడైనా నాకో వంద కావాలని డబాయించి తీసుకోగలవా"

సోమనాధం నవ్వాడు. నవ్వాడన్నమాటేగానీ లోపల ఏడుపొచ్చింది. భార్య ఉగ్రస్వరూపం అతని కళ్ళలో మెదిలింది. నిలదొక్కుకుని... "డబ్బు దుబారా చెయ్యకూడదని తాళాలు మా ఆవిడ బొడ్డుకి తగిలించా గానీ... నాకెంత కావాలంటే అంత నిమిషాలమీద తీసుకోగలను" అన్నాడు.

"సరే పందెం."

"ఎంత?"

"వంద."

సోమనాధం 'బాబోయ్ లేనిపోని గొడవ, ఓడిపోక తప్పదు. ఓడితే యిచ్చుకోడానికి చిల్లుగవ్వ లేదు. కానీ ప్రిస్టేజ్ కొశ్చన్' అనుకున్నాడు

తేరుకొని "సరే ఫోన్‌చేసి తెప్పించనా" అన్నాడు.

"అలాకాదు. ఫోన్లో ఏం మంత్రం వేస్తావో ఎవడు చూడొచ్చాడు. యిద్దరం నా కార్లో మీ ఇంటికి వెళ్దాం. నా ఎదురుగా మీ ఆవిడని డబ్బడగాలి."

"సరే పద."

యిద్దరూ కార్లో వెళ్ళి సోమనాధం బిల్డింగు చేరుకున్నారు.

రామనాధం కుర్చీలో కూలబడ్డాడు. సోమనాధం ఒకవంక భయపడుతూ గొంతు సవరించుకొని "పద్మా" అని అరిచాడు.

పద్మ లోపల్నుంచి వచ్చింది.

"నాకు అర్జెంటుగా వందరూపాయలు కావాలి. పట్రా" అన్నాడు.

పద్మ ఆలస్యం చెయ్యకుండా లోపలికి వెళ్ళి వంద తెచ్చి భర్తకిచ్చింది.

లోలోపల... రామనాధం కుప్పలా కూలిపోయాడు. సోమనాధం అంతకంటె ఆశ్చర్యపోయాడు.

అంతేకాదు... "ఉండండి, కాఫీ తెస్తాను" అని వెళ్ళింది.

రామనాధం 'నిజమేనా' అన్నట్టు చూసాడు. ఆశ్చర్యం కప్పిపుచ్చుకుని సోమనాధం "నే చెప్పలా, ఏది డబ్బు" అన్నాడు.

అతను మౌనంగా పందెం డబ్బు వంద వదిలించుకున్నాడు.

పద్మతెచ్చిన కాఫీతాగి రామనాధం స్నేహితుడికి బై బై చెప్పి కార్లో వెళ్ళిపోయాడు.

ఈ లోగా సోమనాధం గుండెల్లో రైళ్ళు పరుగెట్టసాగాయి, స్నేహితుడు అటు వెళ్ళగానే...పద్మ తనిచ్చిన వంద వసూలు చేస్తుందని... అతనికి శంకగా ఉంది. మర్యాద కాపాడుకోవాలని ముందుగా "పద్మా, సరదాకి అడిగాను, యిదిగో వంద" అని తిరిగి యిచ్చేసాడు.

ఆమె "ఈ వంద సరే... ఆ వంద కూడా యిలా యివ్వండి" అంది.

సోమనాధం అదిరిపడ్డాడు.

"అవునూ, మీరు మర్యాదగా యిస్తారా. నేనే. లాక్కోవాలా" అంటూ మీదపడి లాక్కుంది.

వందనోటు కళ్ళకద్దుకొని అంది "నా మొహం. ఈ డబ్బు నాకు మిగిలేనా, చచ్చేనా సగం శాంతకే పోతుంది. పాపం డబ్బుకావాలిట. భీమ్లీ వెళ్తుందిట, ఫోన్‌చేసి ట్రిక్కు చెప్పి ఫిఫ్టీ ఫిఫ్టీ అంది."

